# మరో సారి ఆదరించండి

- ముథోల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డిగారి విఠల్ రెడ్డి
- తానూర్‌లో భారీ రోడ్‌షో
- ఊరూరా నేతల ప్రచారం
- ప్రజల నుంచి అనూహ్య స్పందన



భైంసా : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్ రెడ్డి

తానూర్, నవంబర్ 13 : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి నిస్వార్థంగా సేవలందిస్తున్న తనను మరోమారు భారీ మెజార్టీతో గెలిపించాలని ముథోల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి కోరారు. సోమవారం జౌలా (కే), వడ్‌గావ్, కుఫ్టి, కల్యాణి, మసల్గ, మొగిలి, మసల్గ తండా, కోలూర్‌తండ, కోలూర్, తానూర్, ఎల్వత్, వడ్గొన గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో సాగు, తాగునీటి కష్టాలు, కరెంట్ కోతలు నేడు లేవన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ చేతులు కాల్చుకున్నదని, తెలంగాణలో కమలం వాడిపోయిందని పేర్కొన్నారు. హంగిర్గా సొసైటీ చైర్మన్ నారాయణ్‌రావు పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతారెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిప్పెర కృష్ణ, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న. మాజీ జడ్పీటీసీ ఉత్తం బాలే రావు, కోఅప్షన్ సభ్యుడు గోవింద్‌పటేల్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు విఠల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, సాయినాథ్, కేశవ్, ఈరేశ్, భగవాన్ పవార్, భీంపవార్, కరీం, మేకల దేవీదాస్, లక్ష్మణ్, మాధవ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష..**

భైంసా, నవంబర్ 13 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి భైంసాలోని సంజీవ్ రెడ్డి ఫ్యాక్టరీలో లోకేశ్వరం మండలానికి చెందిన పలువురితో ఆయన మాట్లాడారు. మాయమాటలతో మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలను నమ్మొద్దని ఆయన సూచించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు రమాదేవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు బుచ్చన్న, తోట రాము, గిరధర్ జంగ్మే ఉన్నారు.

**విఠల్ రెడ్డిని గెలిపించాలి**

ముథోల్, నవంబర్ 13 : బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని గెలిపించాలని నాయకురాలు రమాదేవి కోరారు. ఆది, సోమవారం చించాల, వెంకటాపూర్, ఎడ్‌బిడ్ గ్రామాల్లో నాయకులతో కలిసి విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరోసారి కేసీఆర్‌ను సీఎం చేసి బంగారు తెలంగాణను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మహిళలతో కలిసి నృత్యాలు చేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, ముథోల్ మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, సాయిమోహన్ రెడ్డి, ఆయా కిష్టయ్య, మాజీ సర్పంచ్ అనిల్ పాల్గొన్నారు.

**కుభీర్‌లో..**

కుభీర్, నవంబర్ 13 : మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్నీల అనిల్, కందుర్ బడా సాయినాథ్ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఓటర్లు ఆప్యాయంగా పలకరిస్తూ తమ ఓటు కేసీఆర్ సార్‌కే అంటూ చెబుతుండడంతో నాయకుల్లో జోష్ కనిపించింది. మాజీ సర్పంచ్ బాబు, సాహెబ్‌రావు, కల్యాణ్, రవూఫ్, గడ్డం సంజీవ్, గంగాధర్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

**లోకేశ్వరంలో..**

లోకేశ్వరం, నవంబర్ 13 : మండలంలోని బామ్ని, నగర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బీఆర్ఎస్‌కు వస్తున్న స్పందన చూసి మూడోసారి ఎమ్మెల్యే విఠల్ రెడ్డి గెలుపు ఖాయమని పేర్కొన్నారు. ఎంపీపీ లలితా భోజన్న, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపె శ్యాంసుందర్, సింగిల్ విండో చైర్మన్ రత్నాకర్ రావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భుజంగ్ రావు, బామ్ని సర్పంచ్ దేవి సునీత, గడచాంద సర్పంచ్ వెంకట్ రావు, ఎంపీటీసీ విజయ సాయారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు దడిగే రవి, సుదర్శన్ రెడ్డి, కపిల్, విజయ్ రావు, సుధీర్ రెడ్డి, అనిల్, ప్రశాంత్, సుధాకర్, బండు పటేల్, సాయారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కుభీర్ : ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ మండల నాయకులు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

## దీపావళి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

భైంసా, నవంబర్, 13 : ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, పలువురు దుకాణాల్లో లక్ష్మీ పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మురళీ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీ కృష్ణ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఫారూఖ్ హైమద్, విలాస్ గాదేవార్, ఆశా, రమేశ్ మాశెట్టివార్, తోటరాము నాయకులు ఉన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

భైంసా, నవంబర్ 13 : తొర్రూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో పాల్గొన్న నిర్మల్ జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు బంగారు, కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిర్మల్ జిల్లా నుంచి ఎంపికైన వారు జాతీయ స్థాయి ఉషూ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 45 కేజీలలోపు విభాగంలో సాక్షి, 48 కేజీల లోపు విభాగంలో సంధ్య, 56 కేజీల లోపు విభాగంలో అనిత, బాలుర విభాగంలో 40 కేజీలలోపు విభాగంలో ఆర్ శ్రీనివాస్, 45 కేజీల లోపు విభాగంలో సోమేశ్ పతకాలు సాధించారని తెలిపారు. వారిని వై రమణా రావు, జ్యోతి, చందుల స్వామి, రాజశ్రీ, శివరాజ్, నితిన్ గౌడ్, లింగం అభిందించారు.

## మూడు నామినేషన్ల తిరస్కరణ

ముథోల్, నవంబర్, 13 : ముథోల్ నియోజకవర్గంలోని ఆర్వో కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికలకు గానూ 23 మంది అభ్యర్థులు 38 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోమల్ రెడ్డి తెలిపారు. అయితే సోమవారం స్క్రూటింగ్ (పరిశీలన)లో భాగంగా వీటిలో మూడు నామినేషన్ల తిరస్కరించినట్లు పేర్కొన్నారు. వీరిలో అఖిలేశ్ బోస్లే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, కాలేవార్ సూర్యనారాయణ ఆమ్‌ఆద్మీ పార్టీ, భూపతి రెడ్డి సింగారెడ్డి అలియన్ సాబ్ డెమోక్రటిక్ రిఫార్మర్స్ పార్టీ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించినట్లు వివరించారు. 20 మంది బరిలో ఉన్నారని, 15న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని పేర్కొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## ప్రజల భద్రతే లక్ష్యంగా కవాతు

భైంసా, నవంబర్ 13 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజల భద్రతే లక్ష్యంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు పట్టణ సీఐ ఎల్ శీను పేర్కొన్నారు. ఆదివారం రాత్రి భైంసాలో పలు ఏరియాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కులు వినియోగించుకోవాలన్నారు. ఈయన వెంట ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

భైంసా, నవంబర్, 13: రాజకీయ లబ్ధికోసమే ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించేందుకు కమిటీ వేస్తామని ప్రధాని మోడీ ప్రకటించడం ఓటు బ్యాంకు రాజకీయమేనని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. ఆదివారం భైంసా బస్టాండ్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రధాన మోడీ, బీజేపీ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తూ మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. నిరసన చేపట్టిన వారిలో మాలల ఐక్యవేదిక ముథోల్ అధ్యక్షులు గౌర శ్రీనివాస్, ప్రసన్నజిత్ ఆగ్రే, వాడేకర్ లక్ష్మణ్, గిరిధర్ జంగ్మే, దగ్డే గంగాధర్, రాహుల్ దగ్డే, సాహెబ్ రావు, యశ్వంత్ బన్సోడే, తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి ఆలయంలో చోరీ

ముథోల్, నవంబర్ 13 : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల మహాలక్ష్మి మందిరంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి గ్రామ బయట ఉన్న మహాలక్ష్మి ఆలయం తలుపులు పగులగొట్టి అమ్మవారి మీద ఉన్న 9 తులాల వెండి ఆభరణాలు, ఐదు గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

**చోరీకి యత్నం**

తానూర్, నవంబర్, 13 : మండల కేంద్రంలో గల విఠలేశ్వర ఆలయంలో సోమవారం వేకువ జామున దుండగులు చోరీకి యత్నించారు. ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు గుర్తించి ఎస్ఐ సందీప్‌కు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకొని పోలీసు జాగిలాన్ని రప్పించి తనిఖీలు నిర్వహించారు.